క్లుప్తంగా

రేపు తాగునీటి సరఫరాలో పాక్షిక అంతరాయం

నెహ్రూనగర్: తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో డీఫిల్టరేషన్ ప్లాంటు వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు నగరంలో తాగునీటి సరఫరా అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఎస్ఈ సుందరరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రాజీవ్ గాంధీ నగర్, వసంతరాయపురం, హనుమయ్యనగర్, నెహ్రూనగర్, శారదా కాలనీ రిజర్వాయర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు పాక్షికంగా అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నగర ప్రజలు ముందుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.

అంగరంగ వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



పాత గుంటూరు: బ్రాడీపేట ఓంకార క్షేత్రం పాలకమండలి కార్యదర్శి నంబూరు శ్రీమన్నారాయణ మూర్తి ఆధ్వర్యంలో 90వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలలో భాగంగా బుధవారం నిత్య పూజలు, శ్రీరామ పట్టాభి షేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాల్ని అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, పూజల్లో పాల్గొన్న దంపతులు శ్రీ రామ పాదుకలను తలపై ఉంచుకుని, ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం శాంతి హోమం పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ, భక్తులకు అన్నదానం నిర్వహించారు. శ్రీ సీతారామ పరివారంతో జరిగిన నగరోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి.

సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ట




గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లో ఆధునికీకరించిన హిందూ బీఈడీ కళాశాల ప్రాంగణంలో బుధవారం సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్టను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి చింతలపాటి వేంకట రామయ్య దంపతుల ఆధ్వర్యంలో సరస్వతీదేవి విగ్రహానికి జలాధివాస, ధాన్యాధివాస కార్యక్రమాలతో పాటు మంత్రపూరితమైన పవిత్రజలంతో అభిషేకించారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలతో పాటు సరస్వతీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆధునికీరించిన భవనాన్ని డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు మాజేటి సోమశేఖరరావు, హిందూ కాలేజీ హైస్కూల్ కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు సూచించారు. కొత్తపేటలోని ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో బుధవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టు నమూనాలతో పాటు వర్కింగ్ మోడల్స్ తిలకించి, వారిని అభినందించారు. ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుని, అద్భుతమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేశారని ప్రశంసించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల గైడెన్స్‌లో విద్యార్థులు ఎంతో కష్టపడి శాస్త్ర, సాంకేతిక, విద్యా, పర్యావరణ అంశాల సమాహారంగా 180 ప్రాజెక్టులను తయారు చేసి, ప్రదర్శించారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ బాలకృష్ణ, నవీన్, అకడమిక్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, ఏఓ బోస్, ఏజీఎం భానుప్రసాద్, ఇన్‌చార్జ్ జైమున్నీసా బేగం పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో మహిళలకు శ్రద్ధ అవసరం



లక్ష్మీపురం: మహిళలు ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు సంబంధిత వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలని గుంటూరు రైల్వే డివిజన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక సూచించారు. పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజనల్ కార్యాలయంలో బుధవారం రుతుస్రావ పరిశుభ్రతపై మహిళా సంక్షేమ సంస్థ, డీఆర్ఎం సతీమణి, గుంటూరు డివిజన్ ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఆశాలత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ మంచి రుతు ఆరోగ్యం, పరిశుభ్రత పద్ధతులతో అంటువ్యాధుల్ని నివారించవచ్చని తెలిపారు. అనంతరం మహిళలకు ఎకో ఫ్రెండ్లీ శానిటరీ న్యాప్‌కిన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అఖిల, షర్మిల, లత, కల్పన పాల్గొన్నారు.

తూర్పులో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

- విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ధీమా
- కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ ఇన్‌చార్జీలు, అధ్యక్షుల సమావేశంలో నేతల దిశా నిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా. పక్కన విప్ అప్పిరెడ్డి, మేయర్ కావటి, బాలవజ్రబాబు, నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన అసెంబ్లీ నియోజకవర్గాల్లో గుంటూరు తూర్పు ఒకటని శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. చంద్రమౌళీనగర్‌లోని ఆయన నివాసంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ ఇన్‌చార్జీలు, అధ్యక్షులతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ ఏమాత్రం ఆలోచించాల్సిన అవసరమే లేకుండా గెలిచే నియోజకవర్గాలలో తూర్పు మొదటి స్థానంలో ఉంటుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు దాని పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను క్లీన్ స్వీప్ చేయడం ద్వారా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు నాంది పలకడం ఖాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో రానున్నవి అత్యంత కీలకమైన ఎన్నికలని, రెండు రాజకీయ పార్టీల మధ్య జరిగే సాధారణ ఎన్నికలు కావని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లుగా పేదలు, పెత్తందారుల నడుమ జరిగే యుద్ధమని స్పష్టం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని, అందుకు మనమంతా సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎటువంటి భేషజాలకు తావులేకుండా, విభేదాలు పక్కనబెట్టి తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా గెలుపు మనస్ఫూర్తిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

- తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కార్పొరేటర్లు క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని, కలసికట్టుగా డివిజన్లలోని ప్రజలతో మమేకం కావాలని కోరారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఇవి కొనసాగాలంటే మళ్లీ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని వారికి వివరించి చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గం నుంచి తన కుమార్తె నూరి ఫాతిమాను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.
- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో నూరి ఫాతిమాను గెలిపించుకోవడం ద్వారా హ్యాట్రిక్ కొట్టి సీఎం వైఎస్. జగనన్నకు కానుకగా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అందుకోసం అభిప్రాయ భేదాల్ని విడనాడాలని సూచించారు. తూర్పు నియోజకవర్గంలో గెలుపు రానున్న పాతికేళ్ల భావితరాల బంగారు భవిష్యత్తుకు పునాది అని చెప్పారు.
- పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అంటే ఒక కులానికో లేక ఒక మతానికో సంబంధించిన పార్టీ కాదన్నారు. ఇది నిరుపేదల అభివృద్ధి కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆవిర్భవించిన పార్టీ అని స్పష్టం చేశారు. విభేదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ తన గెలుపు కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నిజాయతీగా పార్టీ జెండా మోసే ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తప్పకుండా సముచిత స్థానం ఉంటుందని తెలిపారు.
- నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ గతంలో మనం కష్టపడిన దానికి ప్రతిఫలంగా ప్రస్తుతం కార్పొరేటర్లుగా ఒక ఉన్నతమైన స్థానంలో ఉన్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో నూరి ఫాతిమాను గెలిపించుకోవడం ద్వారా మరింత బలమైన నాయకులుగా ఎదగడానికి ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

తాగునీటికి అంతరాయం లేకుండా చర్యలు

మేయర్ కావటి



సంప్ శుభ్రం చేయడాన్ని పరిశీలిస్తున్న మేయర్

నెహ్రూనగర్: నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా యుద్ధప్రాతిపదికన రిజర్వాయర్ల ట్యాంకులు, సంపులు క్లీనింగ్, మరమ్మతులను చేపడుతున్నట్లు మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. ఆయన బుధవారం హెడ్ వాటర్ వర్క్స్, బీఆర్ స్టేడియం, నల్లచెరువు రిజర్వాయర్ల క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నగరానికి స్వచ్ఛమైన తాగునీటిని కొరత లేకుండా సరఫరా చేయడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. పైప్ లైన్ల లీకులను గుర్తించి తక్షణం మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. తాగునీటిపై ప్రజలలో నెలకొన్న అపోహలు తొలగించడం కోసం నగరానికి ప్రధానంగా తాగునీరు సరఫరా చేసే తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లోని 42 ఎంఎల్.డీ ప్లాంట్, నగరంలోని శ్రీనివాసరావుపేట, నల్లచెరువు, బీఆర్ స్టేడియం, తారకరామ నగర్, ఐపీడీ కాలనీ, ఆటోనగర్, ఏటుకూరుల్లోని రిజర్వాయర్లను, సంపులను బుధవారం యుద్ధప్రాతిపదికన శుభ్రం చేయించినట్లు తెలిపారు. తాగునీటిపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే తక్షణం స్పందించి, సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగునీటిలో క్లోరిన్ సమపాళ్లలో ఉన్నదీ లేనిదీ తరచూ తనిఖీ చేసి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిజిస్టర్లలో నమోదు చేయాలని తెలిపారు. రిజర్వాయర్లలో కూడా తప్పనిసరిగా క్లోరిన్ తనిఖీ చేయాలని సూచించారు. రిజర్వాయర్ నుంచి ఇళ్లకు తాగునీటి సరఫరా చేసే సమయంలో ఎమినిటీ కార్యదర్శులు టైల్ ఎండ్ పాయింట్ వరకు శాంపిల్స్ సేకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ సుందరరామిరెడ్డి, ఈఈలు జె.శ్రీనివాస్, కోటేశ్వరరావు, డీఈఈ హనీఫ్, శ్రీధర్, ఏఈలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తాం

సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. బుధవారం నియోజకవర్గంలోని 14వ డివిజన్ కబడ్డీగూడెంలో పీకలవాగు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు శ్రీనివాస్, ఎం. సుధాకర్‌రెడ్డి, వేణు, షైనా, నసీర్, రబ్బాని పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

నియోజకవర్గంలోని 55వ డివిజన్ కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్ ఆధ్వర్యంలో బొంగరాలబీడులోని మస్తాన్ కల్యాణ మండపంలో పార్టీ ముఖ్య నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ విభేదాలకు తావులేకుండా పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని, రానున్న ఎన్నికల్లో జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ జెండాను భుజాన పెట్టుకుని బాధ్యతగా వ్యవహరించే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో నాయకులంతా కలిసి ప్రజలతో మమేకమై వైఎస్సార్ సీపీ అందజేస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

అంజుమన్ ఈ ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో పొన్నూరు రోడ్డులోని అంజుమన్ పాఠశాలలో టైలరింగ్ శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ కార్యక్రమంలో సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ముఖ్యఅతిథిగా పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని తెలిపారు. ఆయన ప్రభుత్వంలో మహిళలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నారని, వారి కోసం వివిధ సంక్షేమ పథకాలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో అంజుమన్ ఈ ఇస్లామియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిద్ధార్థ గ్యాస్ట్రో సెంటర్ ప్రారంభం



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి. పక్కన ఎంపీ అయోధ్య రామిరెడ్డి, డాక్టర్ సిద్ధార్థరెడ్డి

గుంటూరు మెడికల్: కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులో నూతనంగా నిర్మించిన సిద్ధార్థ గ్యాస్ట్రో కేర్ హాస్పిటల్‌ను హైదరాబాద్ ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వరరెడ్డి బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సిద్ధార్థ నాలుగేళ్లపాటు తన వద్ద ప్రత్యేక శిక్షణ పొంది, ఎంతో నైపుణ్యం సాధించారని తెలిపారు. గుంటూరు ప్రజలకు సేవలందించేందుకు ఎండో స్కోపి, కొలనోస్కోపి, స్కానింగ్ సంబంధిత అత్యాధునిక వైద్య పరికరాలు హైదరాబాద్ కంటే దీటైన స్థాయిలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ హాస్పిటల్ నిర్మించడం అభినందనీయమన్నారు.డాక్టర్ సిద్ధార్థలో హైఎస్ట్ లెవల్‌లో నైపుణ్యంతో పాటు రోగులపై ప్రేమ, దయ ఉన్నాయని చెప్పారు. మంచి గుణాలున్న వైద్యులు ఈ రోజుల్లో కనబడడం చాలా అరుదని పేర్కొన్నారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు గ్యాస్ట్రో ఎంట్రాలజీ సమస్యలు పెరిగిపోతున్నాయని చెప్పారు. వ్యాధులకు అత్యాధునిక వైద్య సేవల్ని ప్రజలకు చేరువ చేసి, అందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.ఎం. జియావుద్దీన్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్యవరప్రసాద్ , ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, డాక్టర్ తేజస్వి, ఆళ్ల శివారెడ్డి, ఆళ్ల వెంకట నాగార్జునరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యులు, పాల్గొని డాక్టర్ సిద్ధార్థరెడ్డికి అభినందనలు తెలిపారు.

డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి అవార్డు



గుంటూరు మెడికల్: రోగి మెలకువగా ఉండగానే ల్యాప్‌ట్యాప్‌లో సినిమాలు చూపిస్తూ బ్రెయిన్ ఆపరేషన్లు చేసి అరుదైన రికార్డును సొంతం చేసుకున్న గుంటూరుకు చెందిన సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డికి ఇండో- ఫ్రెంచ్ అవార్డు లభించింది. విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో మూడు రోజులుగా జరుగుతున్న సదస్సులో ఆయన ఇన్నోవేటివ్ కంట్రిబ్యూషన్ ఇన్ బ్రెయిన్ రీసెర్చ్ అవుట్ స్టాండింగ్ ఓరియేషన్ అవార్డు- 2024ను అందుకున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించి బ్రెయిన్ వ్యాధి నిర్ధారణలో న్యూరో నావిగేషన్‌తో ఆపరేషన్లు చేస్తున్నందుకు అవార్డును ఇచ్చారు. న్యూరో నావిగేషన్ ఏవిధంగా బ్రెయిన్ వ్యాధి నిర్ధారణలో ఉపయోగిస్తున్నామనే విషయాన్ని సదస్సులో అందరికీ తెలియజేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల చేసిన అయోధ్య బలరాముడి మందిర ప్రారంభోత్సవాన్ని ఓ రోగికి చూపిస్తూ విజయవంతంగా బ్రెయిన్ అవేక్ సర్జరీ చేసిన విషయాన్ని డాక్టర్ శ్రీనివాసరెడ్డి వివరించారు. గతంలోనూ బాహుబలి సినిమా, బిగ్‌బాస్ షో, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని రోగులకు చూపిస్తూ ఆపరేషన్లు చేసి డాక్టర్ శ్రీనివాసరెడ్డి రికార్డు సృష్టించారు. ఇండో ఫ్రెంచ్ అవార్డు అందుకున్న బ్రింద న్యూరో సెంటర్ చీఫ్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాసరెడ్డికి పలువురు న్యూరో సర్జన్లు, న్యూరాలజిస్టులు బుధవారం అభినందనలు తెలిపారు.

29నుంచి శ్రీ వారాహి సహిత శత చండీ కదళీ యాగం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతులు మహా రుద్రస్వామి

పాత గుంటూరు: తిరుపతి తిరుచానూరు శ్రీ సప్త మాతక పరిహార వారాహి శక్తిపీఠం, శ్రీ సప్త కన్యకా శక్తిపీఠం లక్ష్మీ పురం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి మార్చి 2వ తేదీ వరకు విజయవాడ తాడిగడపలోని అనుమోలు గార్డెన్స్‌లో లోక కల్యాణార్థం రాష్ట్రస్థాయి శ్రీ వారాహి సహిత శత చండీ కదళీ యాగం నిర్వహించనున్నట్లు శ్రీ ఆదివారాహి శక్తి టెంపుల్ పీఠాధిపతులు శ్రీ మహా రుద్ర స్వామి పేర్కొన్నారు.అరండల్ పేటలోని హోటల్లో బుధవారం నిర్వహించిన భక్తుల సమావేశంలో యాగం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. మహా రుద్ర స్వామి మాట్లాడుతూ 29న వేకువ జాము నుంచి వివిధ పూజా క్రతువులతోపాటు 108 హోమ గుండాలతో శ్రీ వారాహి సహిత శత చండి కదళీ యాగం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అశేషంగా పాల్గొని యాగ ఫలాల్నిపొందాలని స్వామి కోరారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ దుద్దుకూరి లక్ష్మీపార్వతి, పద్మావతి నారాయణ, డాక్టర్ సంఘమిత్ర, భాను, శ్రీకాంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ నరేష్‌బాబుకు నేషనల్ బెస్ట్ రీసెర్చ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేంద్రబాబు

గుంటూరు మెడికల్: మల్లిక స్పైయిన్ సెంటర్ అధినేత, గుంటూరుకు చెందిన సీనియర్ స్పైయిన్ సర్జన్ డాక్టర్ జె.నరేష్‌బాబుకు జాతీయ ఉత్తమ పరిశోధన అవార్డు లభించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అవార్డు దక్కించుకున్న ఏకైక వ్యక్తిగా రికార్డు సృష్టించారు. గుంటూరు ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని మల్లిక స్పైయిన్ సెంటర్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు డాక్టర్ నరేష్‌బాబు మీడియాకు వెల్లడించారు. వెన్ను, మెడ నొప్పి సమస్యలపై 2022-23 సంవత్సరంలో తమ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన 50 మందిపై తాము పరిశోధన చేశామన్నారు. సర్వేకల్ స్పాండిలైటిస్ సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన వారికి సాధారణంగా పడుకుని తీసే ఎమ్మారై వైద్య పరికరం ద్వారా పరీక్షలు చేయడం పరిపాటిగా పేర్కొన్నారు. ప్రపంచంలోనే మొట్ట మొదటి సారిగా స్టాండింగ్ ఎమ్మారై ద్వారా నూతన విధానంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశామని తెలిపారు. ఈ పరిశోధనా విషయాన్ని ఇటీవల ముంబైలో జరిగిన అసోసియేషన్ ఆఫ్ స్పైయిన్ సర్జన్స్ ఆఫ్ ఇండియా సదస్సులో ప్రజెంట్ చేశామని చెప్పారు. దీనికి అసోసియేషన్ వారు జాతీయ స్థాయిలో బెస్ట్ రీసెర్చ్ అవార్డును అందజేశారని వివరించారు. మరింత లోతుగా పరిశోధనలు చేసేందుకు రీసెర్చ్ గ్రాంట్ కూడా మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ పరిశోధనను ఇటీవల తిరుపతిలో జరిగిన ఆర్థోపెడిక్ సర్జన్స్ రాష్ట్ర సదస్సులో ప్రజెంట్ చేయగా, అత్యంత ప్రతిష్టాత్మకమైన వ్యాఘ్రేశ్వరుడు గోల్డ్‌మెడల్‌ను బహూకరించినట్లు చెప్పారు. జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులను అందుకున్న డాక్టర్ నరేష్‌బాబుకు బుధవారం గుంటూరుకు చెందిన పలువురు స్పైయిన్ సర్జన్లు, ఆర్థోపెడిక్ సర్జన్లు అభినందనలు తెలిపారు.

రోడ్డు వెంబడి చిరు వ్యాపారులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరెడ్డి

గుంటూరు ఈస్ట్: అరండల్‌పేట ప్రాంతంలో రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారికి స్థలాన్ని మార్కింగ్ చేశారు. అది దాటి ముందుకు రాకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ప్రార్థన మందిరం సభ్యుడిని దూషించిన వారిపై కేసు

ప్రార్థన మందిరంలో సభ్యుడిని కొందరు సామాన్లసహా బయటకు గెంటి వేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కన్నావారితోటలోని ప్రార్థన మందిరం సభ్యుల్లోని రెండు వర్గాలకు గతంలో నిర్వహణ విషయంలో గొడవ జరిగింది. దీనిపై కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రార్థన మందిరం సభ్యుడు మహిమ సువర్ణపాల్‌ను సురేష్, లక్ష్మీనారాయణ, వంశీవర్ధన్ రెడ్డి, మరికొందరు దుర్భాషలాడి, అతని సామాన్లు బయటకు పడేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతృభాషలో మాట్లాడటం ఆత్మ గౌరవానికి ప్రతీక



మిణుగురులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్వరూపరాణి, శైలజ, కరీముల్లా, భవాని తదితరులు



జేకేసీ కళాశాలలో ప్రదర్శన తిలకిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: మాతృభాషలో మాట్లాడటం ఆత్మగౌరవానికి, అస్తిత్వానికి ప్రతీక అని ప్రముఖ కవయిత్రి, సాహితీవేత్త, ఏఎన్‌యూ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు విభాగ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వరూపరాణి మాట్లాడుతూ చేస్తున్న పనికి, భాషకు దగ్గర సంబంధముంటుందని, చాలా సందర్భాల్లో పనే భాషను నిర్ణయిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా స్వరూపరాణి రచించిన మిణుగురులు పుస్తకాన్ని ఆవిష్కరించగా, కవి నూకతోటి రవికుమార్ సమీక్ష చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది షేక్ కరీముల్లా, సామాజిక కార్యకర్త జ్యోతిరాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శైలజ, తెలుగు శాఖాధిపతి డాక్టర్ వి.భవాని, అధ్యాపకులు డాక్టర్ ఎస్. విజయలక్ష్మి, డాక్టర్ డి. ధాత్రికుమారి పాల్గొన్నారు.

అమ్మభాషను కాపాడుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: అమ్మభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మాతృభాషలో అర్థమైనట్లుగా విద్యా బోధన మరే ఇతర భాషలోనూ కాదన్నారు. గిడుగు రామ్మూర్తి వంటి మహనీయుల కృషి ఫలితంగా తెలుగు భాష బతికి ఉందన్నారు. మాతృభాషలో సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు ఉన్నాయని, భాషే లేకుంటే ఇవన్నీ కోల్పోయినట్లే అన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధికారి జేవీ సుధీర్‌కుమార్, అధ్యాపకులు ఏ. అంజనీకుమార్, కె. శ్రావణి, నాగరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత

లక్ష్మీపురం: మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యతని గాయకులు వి.ఎస్.ఎస్. మల్లేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆంగ్ల భాషా వ్యాప్తితో ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషలు తమ అస్తిత్వాన్ని కోల్పోతున్న మాట వాస్తవమన్నారు. వివిధ రాష్ట్రాలలోని ప్రజలు మాట్లాడే భాషల్ని చులకన చేయడం సరైంది కాదన్నారు. ఆయా ప్రాంతాల ప్రజల మనోభీష్టానికి అనుగుణంగా వారి మాతృభాషల్ని పరిరక్షించాలని సూచించారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ మాతృభాష మనుగడ సాగించకపోతే మన చారిత్రక, సాంఘిక, సాంస్కృత వారసత్వ సంపద కూడా పరిభాషా పదాల కింద నలిగిపోకతప్పదని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రసంగించారు.

తెలుగుభాష పుస్తక, గ్రంథాల ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా బుధవారం జేకేసీ కళాశాలలోని లైబ్రరీలో తెలుగుభాష సంబంధించిన పుస్తకాలు, గ్రంథాలను ప్రదర్శించారు. తెలుగు, ప్రాచ్య భాషా విభాగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో భాషా లిపి పట్టికలతో పాటు మారిన, మారుతున్న, కాలక్రమంలో మారబోతున్న అక్షరాల ప్రదర్శనపై అవగాహన కల్పించారు. కళాశాల పాలకమండలి సభ్యుడు వేమన కుప్పుస్వామి ప్రదర్శన ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ కీలకం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఆర్ఐవో జుబేర్, ప్రిన్సిపాల్ సునీత

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ ప్రధాన భూమిక పోషిస్తుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గర్నెపూడి సునీత పేర్కొన్నారు. సాంబశివపేటలోని కళాశాలలో బుధవారం 27వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ భావి జీవితానికి కీలకమైన ఇంటర్ దశలో తప్పటడుగులకు తావు లేకుండా క్రమశిక్షణతో లక్ష్య సాధన దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. తమ కళాశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపుతున్నారని చెప్పారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థిని నందిని, పావని, జిమ్నాస్టిక్స్‌లో కీర్తన, రూప ప్రతిభ కనబర్చారని చెప్పారు. రాష్ట్రస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా హెచ్ఈసీ విభాగం నుంచి సీహెచ్. రమ్య ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందుకున్నట్లు వివరించారు. ఆర్ఐవో జీకే జుబేర్ మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వందలాది మంది విద్యార్థినులతో ప్రగతి పథంలో పయనిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా చదువుతో పాటు వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

సందడిగా హిందూ కాలేజీ హైస్కూల్ వార్షికోత్సవం



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మెరుగైన విద్యాబోధనతో విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని హిందూ కాలేజీ హైస్కూల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణప్రసాద్ సూచించారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్ బుధవారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నందనంపాటి రామాంజనేయులు, పాఠశాల కార్యదర్శి కేఎస్సార్ కుటుంబరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన క్రీడా దినోత్సవంలో వ్యాయామ విద్య ప్రాంతీయ ఇన్స్‌పెక్టర్ మొహబూబ్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.